

# ఉపయోగానం

జనార్దనరావు ఆ నిర్ణయం తీసుకొని రెండు రోజులయింది. అతను సాధారణంగా ఏ విషయంలోనూ అంత త్వరపడి ఓ నిర్ణయానికి రాడు. నిర్ణయానికి వచ్చాక ఇంక అమలు పెట్టటంలో ఆలస్యం చెయ్యడు. కానీ... ఆ విషయంలో నిర్ణయానికి వచ్చి అప్పటికి రెండురోజులు పూర్తయినా ఇంకా అమలులోకి తేలేదు. దీనికి ఎన్నో కారణాలున్నాయి.

అన్నీ చెప్పటం కన్నా అన్నిటినీ కలిపి కేవలం ఒకే ఒక్క వాక్యంలో చెబితే బాగుంటుంది. జనార్ధనానికి కుమారి అంటే చచ్చేంత ఇష్టం.

కుమారి జనార్ధనానికి సొంత పెళ్లామే. అతనామెను, ఆమె అతన్ని అందుకుని ఆరు నెలలైనా కాలేదు. కుమారి సంగతేమోగానీ, జనార్ధనానికి మాత్రం కుమారి అంటే ఎంతో అభిమానం ఏర్పడిపోయింది.

ఎవరో తెలీని తను ఆ అమ్మాయి మెడలో మూడు మూళ్లు వేసి వేయగానే ఆ అమ్మాయి, పాపం, ముక్కూముఖం తెలీనివాడు కదా అనైనా ఆలోచించకుండానే, వెంటబడి- అదీ అలాగిలాగా- అమ్మా నాన్నల్ని, తోడబట్టిన సహోదర, సహోదరిలను వదిలి, మిత్రబృందానికి వీడ్కోలు చెప్పి, ఒంటరిగా తన వెంట పెట్టేబేడాతో సహా వచ్చేసింది. ఆ అమ్మాయికి తనంటే ఇష్టమేనన్న సంగతి అప్పుడే తెలిసింది జనార్ధనానికి. 'మూడు ముళ్లు మెడలో పడితే ఏ ఆడదైనా సరే అలాగే రావాలి కాదా!' అని అతను సర్దుకోలేకపోయాడు. తన భార్యకు తనంటే ఉన్న ఇష్టాన్ని అలా సర్దుకోవటం ద్వారా తగ్గించుకోవటమనేది అతనికే నచ్చలేదు.

అలా వచ్చిందా ఆ అమ్మాయి... వచ్చి... నిద్రలేచిన దగ్గర్నించి తనకోసం వండి, వార్చి, వడ్డించి, తన కడుపు నింపి, ఆఫీసుకు పంపి, తిరిగి వచ్చేంతవరకు ఏ పత్రికలతోనో కాలం గడుపుకుని, తను వచ్చేవేళయేసరికి మళ్లీ ముఖం కడుక్కొని బొట్టూకాటుకా పెట్టుకొని, చీర సింగారించుకొని వేచి చూస్తూ, తను రాగానే కాఫీ ఇచ్చి, ఆ తర్వాత మళ్ళీ వండి, వార్చి, వడ్డించి, తనకు కడుపు నింపి, పక్కనే చేరి, 'ఆకలి'తీర్చి... అబ్బో... పాపం, ఆ అమ్మాయి తనకోసం ఒళ్ళు దాచుకోకుండా శ్రమిస్తూనే ఉంది, తనను సుఖపెడుతూనే ఉంది.

నిజానికి తను కోరుకోతగ్గది అంతకన్నా ఏముంటుంది!

భార్యగా ఎన్ని రకాల తనను సుఖపెట్టగలదో అన్ని సుఖాల్ని తనకు వేళకు అమరుస్తోంది కుమారి. కానీ...

కానీ.... జనార్ధనం మనసులో అసంతృప్తి ఉంది.

ఆ అసంతృప్తి అతనిలో బీజమై తలెత్తి, ఈ రోజున ఊడల మర్రిలా అయిపోయింది. అందుకే అతనా నిర్ణయం తీసుకున్నాడు.

నిర్ణయం తీసుకొన్నాక అమలు పెట్టటానికి జనార్ధనం కొంత ముందు వెనుకా ఆలోచించాడు. దానివల్ల లాభనష్టాల్ని బేరీజు వేసుకొన్నాడు.

ఫర్వాలేదు. కుమారి విషయంలో తన నిర్ణయం వల్ల జరిగే నష్టం కన్నా సమకూరే సుఖమే ఎక్కువ అని లాభనష్టాల శాతం లెక్కల్ని పూర్తి చేసుకున్నాడు.

అవన్నీ అయ్యాక... జనార్ధనం ఆ రోజు రాత్రి....

కుమారి అతనికి అన్నం వడ్డించి, అన్ని పనులూ చేసుకొని జనార్ధనం దగ్గరకు రాగానే అతను ఆప్యాయతతో భార్యను దగ్గరకు తీసుకున్నాడు-కుమారి అప్పటికే ఆ ఆప్యాయతలకు అర్థం ఏమిటో, దాని పురుషార్థం ఏమిటో అన్నీ అర్థం చేసుకొంది- పెళ్ళయి ఆరు నెలలు పూర్తి కాలేదు కానీ 160 రాత్రులు పూర్తయ్యాయికదా!

కాసేపు పోయాక, జనార్దనం తన అలసట తీర్చుకొంటూ, కుమారి మగత నిద్రలోకి జారుకొంటూంటే - తన నిర్ణయాన్ని కుమారి చెవిన పడేశాడు. కుమారి ఉలిక్కిపడింది. తను విన్నది నిజమేనా అని ఆలోచించి, మళ్ళీ అడిగింది.

"అవును, నిజమే, నువ్వు పుట్టింటికి వెడుతున్నావు, కాదు, నేనే పంపిస్తున్నాను!" అన్నాడు జనార్దనం.

"నేనిప్పుడు పుట్టింటికి వెళ్ళటం ఏమిటి? ఓ పండుగలేదు, పబ్బం లేదు. మా అమ్మావాళ్ళు రమ్మని ఉత్తరం రాయలేదు. నేను వెళ్ళను!" అంది కుమారి. అప్పటికి కుమారి నిద్ర పూర్తిగా ఎటుపోయిందో కూడా తెలీనంతగా మాయమైంది.

"పండగపబ్బాలు లేవు, మీ వాళ్ళనుంచి ఉత్తరాలు లేవు. నిజమే! కానీ రేపు సాయంత్రం నువ్వు రైల్లో...."

"నేను వెళ్ళటం లేదు! వెడితే బాగుండదు. ఏ కారణం లేకుండా ఎందుకూ వెళ్ళటం?... అయినా ఇదేమిటండి, వస్తున్నదంతా చలికాలం, నన్ను ఇంటికి పొమ్మంటున్నారు. మీ సంగతి ఎవరు చూస్తారు?" అంది కుమారి గోముగా.

"నా సంగతి వదిలి పెట్టు"

"నేను సరే, మరి అలవాటు పడ్డ ప్రాణం..."

"వదిలేసెయ్. ఆ గొడవ అనవసరం! నీకు నేను సీరియస్‌గా చెబుతున్నాను. నువ్వు రేపు మీ పుట్టింటికి వెడుతున్నావు. కనీసం ఓ మూడు నాలుగు నెలలయినా అక్కడే ఉంటున్నావ్..."

"దేనికి?..."

"ఆ సంగతి మీ అమ్మకు, నాన్నగారికి రాశాలే!" అన్నాడు జనార్దనం.

"నన్ను పంపిస్తూ వాళ్ళకు రాయటం ఏమిటి? నాకు చెప్పచ్చు కదా? నేనంత పనికి రాకుండా పోయానా ఏం అప్పుడే? ఆర్నెల్లకే మొహం మొత్తిపోయానన్నమాట - రమ్మన్నప్పుడల్లా ఊ అనడం బుద్ధి తక్కువ అని ఇపుడే తెలిసింది..."

కుమారి అంటున్నది ఆపుతూ అన్నాడు జనార్దనం.. "ఆ గొడవ కాదు..."

"మరింకేమిటి? పెళ్ళయి ఆర్నెల్లయినా కాకుండానే నన్ను పుట్టింటికి పంపటానికి ఇద్దరి మధ్యా ఇంకో గొడవ కారణంగా చెప్పటానికైనా లేదే! పోనీ నాకు చెప్పండి..." అంది కుమారి.

జనార్దనం చెప్పలేదు. ఓసారి కుమారికేసి చూసి, గోడకేసి తిరిగి పడుకున్నాడు.

కుమారికి ఒళ్ళు మండిపోయింది. లేచి, చీరా జాకెట్టూ వేసుకొంది. మర్నాడు సాయంత్రం రైలు ఎక్కింది.

రైలు వాళ్ళ ఊరి స్టేషన్ ప్లాట్‌ఫారంలో ఆగేసరికి తన్ను రిసీవ్ చేసుకోవటానికి వచ్చిన అమ్మా నాన్నా కనపడ్డారు కుమారికి. వాళ్ళ కళ్ళు ఎర్రగా జ్యోతుల్లాగనే ఉన్నాయి. పెళ్ళి చేసి కన్నెచెర విడిపించామురా అని అనుకొనేలోగానే కూతురు రిటర్న్ పోస్టులో తిరిగి వచ్చేస్తే....

బహుశా అవకాశం లేకపోయింది కానీ లేకపోతే తమ ఇద్దర్నీ ఒకచోట కూర్చోబెట్టి తగువు తీర్చేవారు కాబోలు!! అనుకొంది కుమారి.

అయినా... జనార్దనం అంటే కుమారికి చెప్పలేనంత కోపంగా ఉంది. తన తప్పు తనకు తెలీకనే, శిక్ష అమలు చేయగలిగాడు. అంతకన్నా దారుణం ఏముంటుంది?

... జట్కా దిగి, సామాన్లు ఇంట్లోకి చేరిన అయిదు నిమిషాలకే అమ్మ పంచాయితీ పెట్టింది. " ఆడదన్నాక ఓ అదుపూ ఆజ్ఞా ఉండాలి. అబ్బాయికి నచ్చినట్లుగా బతకాలి కానీ.. ఛీ ఛీ.. ఎంత పరువు నష్టం! పెళ్ళయి ఆర్నెల్లయినా కాకుండానే ఆ అబ్బాయి నిన్ను పుట్టింటికి తోలేసాడంటే... ఛీ.. ఛీ.."

కుమారికి మరింత కసి పెరిగింది. క్షణం తన్ను తాను సముదాయించుకొన్నాక అంది.. "ఆయనకు నేను నచ్చలేదని నీకెవరు చెప్పారు? నచ్చకపోతే పెళ్ళెందుకు చేసుకొన్నట్టుట? ఇన్నాళ్ళకు జ్ఞానోదయం కలిగిందిటా ఆ బుద్ధుడికి! చెప్పవే!" అనే కూతుర్ని చూసి కుమారి అమ్మ నోరు వెళ్ళబెట్టింది.

"ఇలాంటి తలతిక్క ప్రశ్నలే వేసుంటావు అతన్ని... అందుకే తన్ని తగలేశాడు ఇంట్లోంచి..."

"ఆయనకు అంత ధైర్యం కూడానూ!"

"అంటే కఱ్ఱా చీపురూ నువ్వే అందుకున్నావా!"

"ఆ! పెళ్ళయి ఆయన ఇంటికి వెళ్ళినప్పటినుంచి చీపురు డ్యూటీ, అప్పడాల కఱ్ఱ డ్యూటీ నాదే.. కానీ అసలు సంగతి చెప్పు. ఆయన నన్ను ఎందుకు పంపినట్లు!"

"ఇంకా సిగ్గులేక ఏ ముఖం పెట్టుకొని అడుగుతున్నావ్.. ఆయన నన్నెందుకు పంపేశారంటూ! భార్య అంటే అణగి మణగి ఉండాలి కానీ మా ఇంటా వంటాలేదు ఇలా మొగుణ్ణి ఎదిరించి పుట్టింటి పంచన చేరటం.."

"అమ్మా, క్షణం ఆ నోరు కట్టిపెట్టి, నేనడిగింది చెప్పు.. ఆయన మీకేమైనా లవ్ లెటర్ రాశారా అని అడుగుతున్నా..'

"లవ్ లెటరా! మాకా! నీకేం పోయే కాలమే..!"

"పుట్టింటికి పోయే కాలం వచ్చింది. దీన్ని తీసుకెళ్ళండి అని ఏమైనా రాశారా?"

"ఆ.. కావాలా ఆ ఉత్తరం? ఫోటో కట్టించుకొని మెడలో వేసుకొని ఊరేగు... అదుగో, అక్కడే ఉంది." అంటూ టేబిల్మీద ఉన్న ఉత్తరం చూపించింది.

కుమారి ఉత్తరం అందుకొంది. చివరికంటూ చదివి మొదట నిర్ఘాంతపోయింది. ఆ తర్వాత ఆశ్చర్యపోయింది. చివరగా నవ్వుకొంది.

ఉత్తరాన్ని మళ్ళీ చదువుకొంది.

"పూజ్యులైన మామగారికి..." అంటూ ప్రారంభమైన ఉత్తరంలో అసలు పేరా కొచ్చేసింది. 'కుమారి విషయంలో మీకు ఇలా రాయటం నాకు కష్టంగానే ఉన్నా తప్పటం లేదు. ఏ విషయాన్నైనా మొదట్లోనే సరి చేసుకోవాలనేది నా పాలసీ, మొక్కయి వంగనిది మానై

అసలు వంగదు కాదా! అన్ని విషయాల్లోనూ కుమారి నాకు నచ్చినా, ఒక్క విషయంలో నాకు నచ్చుటం లేదు. కుమారికన్నా ముందు మా ఊళ్లో అందరూ నిద్రలేస్తారు. ఎన్నో ఆఫీసులు తెరుస్తారు. ఎన్నో బడులు తెరుస్తారు. సూర్యనారాయణ స్వామివారప్పటికి ఆకాశాన బారెడెత్తున ఉంటారు. నాకు పదింటికి ఆఫీసు.. అయితే కుమారి ఏడున్నరకు నేను లేపాక నిద్ర లేస్తోంది. ఈ విషయం నాకు చాలా అసంతృప్తిని కలిగిస్తోంది. ఆడదన్నాక ఏ నాలుగింటికో లేచి పని పాటలు చేసుకోవాలి కానీ ఇలా బారెడు ప్రొద్దెక్కాక లేవటం నాకు నచ్చుటం లేదు. ఎంత ప్రయత్నించినా లాభం లేకపోతోంది. అలారం పెడితే దాన్నెత్తిన ఒకటిచ్చి పడుకొంటుంది. నేను లేవబోతే తన చేయివేసి నన్ను అణచేస్తోందే తప్ప నిద్ర లేవటం లేదు. కానీ ఆడదంటే నా దృష్టిలో – భర్తకన్నా ముందే లేచి పనిపాటలు చేసుకొని, భర్త లేచే వేళకు నవ్వుతూ కనిపించేదే కానీ, నేను మేలుకొలుపులు పాడి లేపాల్సిన దౌర్భాగ్యం నాకు కలిగింది. మీరు అన్యథా భావించక, మీరు ఏం చేసినా సరే, కుమారిని మీ ఇంటికి పంపిస్తున్నాను. కుమారిని నా కలలోన ఇల్లాలిలా తీర్చిదిద్ది పంపండి. దీనికి ఓ అయిదారు నెలలైనా ఫర్వాలేదు. కానీ కుమారిని అలవాటును మార్చుకొన్నాక మాత్రమే పంపండి. ఫలానా రైలుకి ఫలానా తేదీన మీరు కుమారిని రిసీవ్ చేసుకోండి... మీ అమ్మాయికి అన్నింట్లోనూ మంచి అలవాట్లను నేర్చవలసిన బాధ్యత మీదే కనుక ఈ బాధ్యతను స్వీకరించి తర్వాత నాకు ఉత్తరం రాయండి..."

... తనకు కనపడని జనార్దనం, కుమారికి ఆ ఉత్తరంలో ఆ క్షణంలో కనపడ్డాడు. ఆత్రంగా తనను అందుకొనే చేతుల వెనుక అలస్యంగా లేస్తోందే అన్న ఆందోళన ఉందన్నమాట! ఆబగా తన్ను జుర్రుకొనే కోరిక వెనక తన అలవాట్లను మార్చాలనే తపన ఉందన్నమాట!!

–'వడ్లగింజలో బియ్యపు గింజ!' అనుకొంది కుమారి. జనార్దనాన్ని తనదారిలోకి తెచ్చుకోవటం ఎలాగో ఆ రోజునే ఆలోచించి పథకం సిద్ధం చేసుకొంది.

❖ ❖ ❖

మూడు నెలలు గడిచాక, మొదటిసారి జనార్దనం కుమారి వద్దనుండి ఉత్తరం అందుకున్నాడు. కుమారిని పంపించాడే కానీ అతని మనసంతా ఒకటే జాలితో నిండిపోయింది. తను తప్పు చేశాడు! తల్లిదండ్రుల ఇంట గారాబంగా పెరిగిన అమ్మాయి కొంచెం ఆలస్యంగా నిద్రలేస్తే కొంప మునిగిపోయేది ఏముంది? కిందపడి, మీదపడి, తన వేళకు, తనకు అన్నీ అమరుస్తూనే ఉందికదా! అని కొంచెం ఫీలయ్యాడు జనార్దనం.

కానీ... తనకోసం భార్య ఏమైనా చేయగలిగే స్థితిలో ఉండాలి. తను కోరేది పెద్ద తీర్చలేని కోరికేం కాదు. ఓ రెండు గంటలు ముందు లెమ్మంటున్నాడు. అంతేగదా! – దెబ్బపడితే గానీ ఇనుమూ మాట వినదుట – భార్యా అంతే కాబోలు – తన మాట విని, అలవాటు మార్చుకొంటే, ఆమెను నెత్తిమీద పెట్టుకోవటానికి తనూ సిద్ధమే! అనుకున్నాడు.

"...అంత చిన్న విషయం ఇంత పెద్దది చేయటం ఏమీ బాగుండలేదు. అయినా మీ

కోసం, నేను ఈ మధ్య త్వరగానే లేవటం అలవాటు చేసుకొంటున్నాను. మీ కోరిక ప్రకారం నాలుగింటికి కాకపోయినా ఇప్పుడు నేను నాలుగున్నరకు లేవగలుగుతున్నాను. అలారం సహాయం లేకుండా నాలుగింటికే లేచే ప్రయత్నాల్లో ఉన్నాను. నాలుగింటికి లేవగలిగే స్థితి రాగానే మీకు ఉత్తరం రాస్తాను. ఎలాగూ ఇక్కడే ఉన్నాను కనుక, నేను ఒకసారి మీ అమ్మగారింటికి కూడా వెళ్ళివస్తాను. వచ్చేనెల నాలుగున మీ ఊరు వెడుతున్నాను. బహుశ అక్కడి నుంచి అటే మీ దగ్గరికి వస్తాను..."

కుమారి ఉత్తరం చదువుకుని జనార్దనం కాలర్ సర్దుకొన్నాడు. నాతిగల బ్రహ్మచర్యాన్ని అనుభవించటం కష్టమే కానీ, .... అనుభవించగలిగితే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చునన్నమాట అనుకొన్నాడు.

బహుశా ఇంకో రెణ్నెల్లు. ఆ తర్వాత కుమారి తన కోరిక ప్రకారం, తన కలల ప్రకారం... తన ఇంట నడయాడుతుంది అనుకున్నాడు జనార్దనం.

అతను కలగన్న రోజూ రానేవచ్చింది. పెళ్ళిరోజు రేపనగా, ఈ రోజు కుమారి జనార్దనం దగ్గరికి తిరిగి వచ్చేసింది.

రైలు స్టేషన్‌లోనే రిసీవ్ చేసుకొంటూ జనార్దనం "కుమారీ, ఐయాం సారీ.." అని క్షమాపణ కోరుకున్నాడు. కుమారి అతన్ని మనస్ఫూర్తిగా క్షమించేసింది.

"థాంక్స్ కుమారీ, నేను పెట్టిన పరీక్షలో నెగ్గావు. నాకు కావలసింది అంతకన్నా ఏముంది? రేపు మన ఫస్టు వెడ్డింగ్ యానివర్సరీ, పెళ్ళిరోజు కానుక ఇదన్నమాట!" అన్నాడు జనార్దనం.

"వెడ్డింగ్ యానివర్సరీయా? కాదు, బెడ్డింగ్..." అంటుండగనే కుమారిని ఆశతో ఆవరించుకున్నాడు జనార్దనం. అరగంట తర్వాత.. ఒకరి ఒళ్లో ఒకరు. నిద్రాదేవి ఒడిలో ఇద్దరూ.

జనార్దనానికి ఆ రోజు రాత్రి అంత గాఢ నిద్రలోనూ అందమైన కలవచ్చింది. తను ఇంకా నిద్రపోతూండగానే కుమారి లేచి తలంటు పోసుకుని జుట్టు తడి ఆరబెట్టుకొంటూ, వీధిలో అందమైన రంగవల్లులు తీర్చుతూ... బాపుగారి సీతామాలక్ష్మిలాగ...

ఎవరో తలుపు తడుతోంటే జనార్దనానికి మెలకువ వచ్చింది. నిద్రలేచాడు ఉలికిపడి. గడియారం సంగతి ఏమోగాని, కుమారి ఇంకా నిద్రపోతూనే ఉంది. వెంటిలేటర్‌లోంచి ఎండ - వెలుగు కాదు - గదిలో ముగ్గుల్ని పెడుతోంది.

కుమారి గురకలో గడియారం చప్పుడు వినపడ్డం లేదు.

జనార్దనం కోపం దిగమింగుకొంటూ వెళ్లి తలుపుతీసి పాలు పోయించుకొన్నాడు. ఆ గిన్నె వంటింట్లో పెట్టితలుపువేసి భార్య దగ్గరకు వెళ్ళాడు. కుమారిని జబ్బపట్టుకొని లేపాడు.

కుమారి కళ్లు నలుపుకొంటూంటే అడిగాడు. "టైమ్ ఎంతయిందో తెలుసా?"

"ఎంతయింది"

"ఎనిమిది ఇరవై..."

"ఇంతేనా? రోజూ తొమ్మిదింటికి కానీ లేవను నేను... పడుకోండి!....."

జనార్దనానికి నిద్రమత్తంతా వదిలిపోయింది. తొమ్మిదింటికా? అంటే .... తనకు రాసిన ఉత్తరంలో... నాలుగింటికి లేస్తున్నాననే రాసిందికదా!

అదే అడిగాడు....

"ఏం చేయనండి... నాలుగింటికి లేవటం అలవాటయ్యాకే మీ ఇంటికి వెళ్లాను. అక్కడ నాలుగింటికి లేచి పనులు మొదలెడితే, మీ అమ్మగారి నిద్ర పాడవుతోందని....అవిడగారు నాకు చీవాట్లేసి మళ్ళీ పడుకోబెట్టేవారు. మీ నాన్నగారికి కాలేజీ షిఫ్ట్ మధ్యాహ్నం కదా.. రెండింటికి వెళ్ళి క్లాసు తీసుకోవాలి ఆయన – నేను తొమ్మిదింటికి, తొమ్మిదిన్నరకూ లేచి, మీ అమ్మగార్ని లేపితే ఆవిడ లేచేవారు. ఇది మీ అమ్మగారిచ్చిన ట్రైనింగేలెండి. మార్పు కావాలంటే మీ అమ్మగార్ని వాళ్ళమ్మగారింటికి..."

జనార్దనం ఒకచేత్తో కుమారి నోరు మూస్తూ, రెండో చేత్తో తల పట్టుకున్నాడు.

తల ఎత్తి చూసేసరికి – జోగుతూ కుమారి అతని ఒళ్లోకి వాలింది!!

– సౌమ్య, జనవరి...